# అమర గాయకుడు

ఈ మధ్యనే కీర్తిశేషుడైన అమరగాయకుని కంఠం మైక్‌లోంచి శ్రావ్యంగా వినిపిస్తోంది దూరంగా.

రోడ్డుమీద నడుస్తున్న శంకరం, సుబ్బారావులు ఆగిపోయి వినసాగారు.

"అది కీర్తిశేషుడు 'శేషాచలం' ఆఖరుసారిగా పాడిన పాట కాదూ ? అతను చనిపోయాడంటే నమ్మబుద్ధి కావటం లేదు !" శంకరం అన్నాడు.

"కొందరికి మరణం అనేది వుండదు. వారి కంఠస్వరం వినిపించినంతసేపూ వాళ్ళు బ్రతికివస్తారు!" సుబ్బారావు దూరంగా వినిపిస్తున్న పాటలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ జవాబిచ్చాడు.

"'శేషాచలం' వేలకొద్దీ సినిమా పాటలు పాడాడు. వందల కొద్దీ ప్రైవేటు రికార్డు లిచ్చాడు. రోజూ యెప్పుడో వోసారి అతని కంఠం వినబడకుండా పోదు ! ఏ వ్యక్తికేనా, నిత్యం అతని కంఠ స్వరం వినబడుతూ వుండటమో, నిత్యం జనం అతని పేరును స్మరించడమో కంటే ఏం కావాలి ? ఎవరు కోరుకునేదేనా అదే ! ఆ రకంగా శేషాచలం ధన్యజీవి !" సుబ్బారావు బస్సు స్టేజి వైపు నడుస్తూ అన్నాడు.

"'శేషాచలం' మరణించినా టేప్‌రికార్డర్ల ద్వారా, టీవీలో, రేడియోలో, మైకుల్లో నిత్యం అతనికంఠం వినగలగడం అతనిభార్య అదృష్టం ! ఆ పాటల్ని, ఆ గొంతుని విన్నప్పుడల్లా అతని రూపం ఆమె కళ్ళముందు కదలాడదూ ? ఆమెపరంగా అతనికి మరణ మన్నదే లేదు ! అతను అమరుడు ! అంతులేని అతని జ్ఞాపకాల పరంపరలో ఆమె తన శేషజీవితాన్ని సంతోషంగా గడపవచ్చు !" సిటీబస్సుకోసం ఎదురుచూస్తూ శంకరం అన్నాడు.

అంతట్లో సిటీబస్సు వచ్చింది. శంకరం సుబ్బారావులు సిటీ బస్సెక్కి సికింద్రాబాదు చేరుకున్నారు. తమ యిళ్ళకు వెళ్ళారు.

మర్నాడు ఆఫీసులకు వెళ్ళటానికి సిటీబస్సు ఎక్కడానికి వచ్చినప్పుడు శంకరం, సుబ్బారావుతో "ఓయ్ సుబ్బారావూ ! శేషా చలంగారి భార్య మద్రాసునుంచి మొన్న మనవూరు వచ్చేసిందట ! మా చెల్లాయి సరళావాళ్ళింటి ప్రక్కమేడ అద్దెకు తీసుకున్నారట. సాయంత్రం వోసారి వాళ్ళింటికి వెళ్ళివద్దామా ?" అన్నాడు.

"అలాగా ! తప్పకుండా వెళ్ళి ఆవిడకి మన సానుభూతి తెలిపివద్దాం !" సుబ్బారావు అన్నాడు.

మిత్రులిద్దరూ కలిసి సాయంకాలం విద్యానగర్‌లోవున్న కీ. శే. 'శేషాచలం'గారి భార్య యింటికి బయలుదేరారు.

విద్యానగర్‌లో సిటీబస్సుదిగి శంకరం చెప్పిన గుర్తుల ప్రకారం నడవసాగారు.

"అప్పుడే మనవాళ్ళు 'శేషాచలాన్ని' మరచి పోతున్నారు. ఇన్ని రోజులు తమని ఆనంద రసాంబుధిలో వోలలాడించిన అద్భుత ప్రజ్ఞాశాలి జ్ఞాపకార్థం వో చక్కటి 'స్మృతి చిహ్నాన్ని' నెలకొల్పు దామన్న ఆలోచనేనా లేదు ఎవరికీ ! మళ్ళీ అతను బ్రతికున్నప్పుడు సన్మానాలు చెయ్యడానికి, సువర్ణఘంటా కంకణాలు బహూకరించ డానికి, బిరుదులు ప్రదానం చెయ్యడానికి, అతన్ని చూడటానికి, అతని కంఠం వినడానికి, కొట్టుకు చచ్చేవారు !" సుబ్బారావు బాధగా అన్నాడు.

"ఆఖరికి మన రాజధానీ నగరంలో ఒక రోడ్డుకైనా అతని పేరు పెట్టలేదు ! ప్రఖ్యాత హిందీ గాయని తండ్రి పేరు మాత్రం అర్జంటుగా వో రోడ్డుకు పెట్టిస్తానని అభయమిచ్చాడు వో మంత్రి గారు. పరాయి వాళ్ళంటే ఆంధ్రులకి ఎనలేని ప్రేమ !" కోపంగా అన్నాడు శంకరం.

"మన సంగతిని చక్కగా కనిపెట్టాడు కనుకనే గురజాడ గిరీశం చేత 'మనవాళ్ళుట్టి వెధవాయలోయ్!' అని యెనభయ్యేళ్ళ క్రితమే అనిపించాడు !" కసిగా అన్నాడు సుబ్బారావు.

ఇంతట్లో కీ. శే. శేషాచలంగారి భార్య వుంటున్న మేడ వచ్చేసింది. గుమ్మం దగ్గరకు వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కారు.

"ఎవరు కావాలి మీకు ?" తలుపు తెరిచిన పని కుర్రాడు అడిగాడు.

"కీ. శే. శేషాచలంగారి భార్య వుంటున్నది యిక్కడే కదా?" శంకరం అడిగాడు.

"ఏ శేషాచలం గారండీ ?" పనికుర్రాడు మళ్ళీ ప్రశ్నించాడు.

"గాయకుడు శేషాచలంగారు !" శంకరం జవాబిచ్చాడు.

"లోపల కనుక్కొనొస్తానండి !" కుర్రాడు లోపలికెళ్ళాడు.

"నువ్వు సరిగ్గా కనుక్కున్నావా శంకరం ?" సుబ్బారావు శంకరాన్ని ప్రశ్నించాడు అనుమానంగా.

"కనుక్కున్నానోయ్! ముందర చాలాసేపు ఆవిడ ఫలానా అని చెప్పలేదుట ! కాని చివరకి చెప్పిందట ! ఆ విషయం ఎవరి

తోటీ అనవద్దని కూడా చెప్పిందట! కాని నేను శేషాచలం వెర్రి అభిమానినని తెలిసిన మా చెల్లెలు నాకు చెప్పింది!'' శంకరం అన్నాడు.

''తను శేషాచలంగారి భార్యనని ఎవరితోటీ చెప్పవద్దందా? ఎందుకని?'' ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

''నాకూ అదే అర్థం కాలేదు!'' శంకరం జవాబిచ్చాడు.

''వారితో ఏం పనో కనుక్కోమన్నారండి!'' లోపలి నుంచి వచ్చిన పని కుర్రాడు అన్నాడు.

''వారిని చూసి మాట్లాడి వెళ్లటానికి వచ్చామని చెప్పు!'' శంకరం అసహనంగా జవాబిచ్చాడు.

పని కుర్రాడు లోపలికి వెళ్లి వెంటనే తిరిగి వచ్చి ''లోపలికి రండి! అమ్మగారు మిమ్మల్ని కాస్సేపు కూర్చోమన్నారు'' అంటూ వాళ్ళని డ్రాయింగు రూమ్‌లోకి తీసుకువెళ్ళి సోఫాల్లో కూర్చో బెట్టాడు. తను లోపలికి వెళ్ళాడు.

''ఆవిడకి మనని చూడటం యిష్టం లేనట్టుందే!'' సుబ్బారావు చిన్న గొంతుతో శంకరంతో అన్నాడు.

''ఎందుకో, ఏమిటో, నాకేం అర్థం కావటం లేదు!'' చిన్నగా జవాబిచ్చాడు శంకరం.

మిత్రులిద్దరూ డ్రాయింగు రూము తీరిగ్గా పరిశీలించ సాగారు. డ్రాయింగ్ రూమ్ నిండా కీ. శే. శేషాచలంగారి ఫోటోలు రకరకాలవి వుండి వుంటాయన్న వాళ్ళ వూహ తప్పైంది! ఎక్కడా వొక్క ఫోటో లేదు! దిక్కులు చూడసాగారు వాళ్ళు!

ఒక అరగంట గడిచాక కీ. శే. శేషాచలంగారి భార్య లోపల నుండి వాళ్ళని చూడటానికి వచ్చింది.

ఆమె వయస్సు యాభై లోపే వుండచ్చు కాని అకాల వార్థక్యం మీద పడినట్టుగా, ఆమె యాభై యేళ్ళకే డెబ్బైయేళ్ళ స్త్రీలా వుంది! అంతవరకూ ఏడ్చి ఏడ్చి వున్నట్లు ఆమె కళ్ళు ఉబ్బివున్నాయి. తప్పక వారిని చూడటానికి వచ్చినట్టుందామె వాలకం.

''నమస్కారం! నాతో యేదో మాట్లాడాలని వచ్చారట!'' ఆమె తలపైకెత్తి యెత్తనట్టుగా వాళ్ళని చూస్తూ ప్రశ్నించింది.

''నమస్కారమండీ! నేనూ సుబ్బారావు! మేమూ శంకరం, కీ. శే. శేషాచలంగారి అభిమానులం! ఆయన మా అభిమాన గాయకులు! మీరు యీ వూరు వచ్చారని తెలిసి మిమ్మల్ని చూసి పోదామని వచ్చాం!'' సుబ్బారావు జవాబిచ్చాడు.

''నేను యిక్కడికి వచ్చానని మీకెవరు చెప్పారు?'' మళ్ళీ అడిగిందావిడ.

''మీ ప్రక్కింటిలో వుంటున్న సరళ మా చెల్లాయండి. శేషాచలంగారంటే నాకు వెర్రి అభిమానమని, మీరు చెప్పొద్దన్నా మీ విషయం నాకు చెప్పింది!'' శంకరం గబగబా చెప్పాడు

''ఎవరు సరళా!'' ఒక్క నిముషం ఆలోచించింది ఆవిడ.

''ఆ విషయం కూడా చెప్పిందా?'' తనలో తనే మెల్లిగా గొణుక్కున్నా అది మిత్రుల కిద్దరికీ వినిపించి ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

''గోపీ!'' లోపలికి చూసి పిలిచిందావిడ.

''ఏమమ్మా'' గోపీ అనిపిలవబడ్డ యిందాకటి పనికుర్రాడు ఆవిడ దగ్గర కొచ్చి వినయంగా నిలబడి అడిగాడు.

''గోపీ! నా గదిలో టేబుల్ మీద పెద్ద ఆల్బము, టేపు రికార్డరు వుంటుంది పట్టా!'' అని చెప్పింది ఆవిడ.

''అలాగే నమ్మా'' అంటూ లోపలికి వెళ్ళిన గోపీ రెండు నిముషాల్లో పెద్ద ఆల్బము నొకదాన్నీ, టేప్ రికార్డరునూ తీసుకు వచ్చాడు.

''ఇందులో వారి ఫోటోలున్నాయి చూడండి!'' అని ఆల్బమును వారి చేతికిచ్చింది.

శంకరం, సుబ్బారావులు ఆతృతగా ఆల్బమును తిరగవెయ్య సాగారు. అందులో 'శేషాచలం' సినిమా రంగంలోని వివిధ వ్యక్తులతో పాటల రికార్డింగప్పుడు, శతదినోత్సవాలప్పుడు, సన్మానాలప్పుడు తీయించుకున్న ఎన్నో ఫోటోలున్నాయి. వాటిని ఆనందంగా చూస్తూ వాటిల్లోని వ్యక్తుల్ని గుర్తు పట్టడానికి ప్రయత్నిస్తున్నారు, మిత్రులిద్దరూ.

కొంత సేపయ్యాక ''వారి పాటలు కొన్ని, రికార్డులుగా రానివి, వారు యింట్లో పాడి రికార్డు చేసినవి, ఈ టేప్‌రికార్డులో వున్నాయి. వింటారా?'' అడిగిందావిడ.

''తప్పకుండాను!'' మిత్రులిద్దరూ ఒకేసారి ఆనందంగా జవాబిచ్చారు. ఇంతవరకూ ఎవరూ వినని 'శేషాచలం'గారి పాటలు వినబోతున్నామంటే సంతోషంగా వుండదూ ఎవరికైనా?

టేప్‌రికార్డరు 'ఆన్' చేసిందావిడ.

అమరగాయకుడు 'శేషాచలం' కంఠం మృదువుగా, శ్రావ్యంగా గంగాఝరీ సదృశంగా పాటల్ని ఆలాపిస్తోంది. ఏ వాయిద్యాల సహకారం లేకుండానే ఎంతో మనోహరంగా వున్న ఆ గానామృతాన్ని ఆస్వాదిస్తున్న మిత్రులకు ఆమె ఎప్పుడు లోపలికి వెళ్ళిందో కూడా తెలియదు.

దాదాపు, గంటన్నర సాగిన ఆ గానం పూర్తికాగానే టేప్ రికార్డరు 'ఆటోమాటిక్'గా ఆగిపోయింది. మరో పదినిముషాలకు ఆ గానపు మత్తు నుండి బయటపడ్డారు మిత్రులిద్దరూ. అటూ యిటూ చూస్తే ఆవిడ కనబడలేదు!

మరి కొద్దిసేపటికి లోపలినుండి వచ్చిందావిడ !

"మీ ఆదరాభిమానాలకు ఎంతో కృతజ్ఞులమమ్మా! మీ దయవల్ల కీ. శే. శేషాచలం గారి అపూర్వ అమరగానాన్ని మరోసారి తనివితీరా వినగలిగాం! నిత్యం వారి గానాన్ని వినగలిగే మీరెంతో అదృష్టవంతులు" శంకరం పొగిడాడు ఆవిణ్ణి.

"నాదా? అదృష్టమా?" విషాదంగా అందావిడ !

"అవునమ్మా! నిత్యం వారి గానాన్ని ఏదో వైపునుండి వినగలిగే మీరు నిశ్చయంగా అదృష్టవంతులే! అది అందరికీ లభించని వరం!" మెరిసే కళ్ళతో అన్నాడు సుబ్బారావు.

అంతవరకు బలవంతాన అదిమిపెట్టుకున్న ఆవిడ దుఃఖం కట్టలు త్రెంచుకుని బయటకురికింది. కనురెప్పల చాటున దాగున్న కన్నీరు ధారగా కారసాగింది చెంపలమీంచి !

"నేను అదృష్టవంతురాల్ని కాదు బాబూ! శాపగ్రస్తను!" భోరున ఏడుస్తూ అందావిడ !

శంకరం సుబ్బారావులు నిశ్చేష్టులయ్యారు !

కొంతసేపు ఏడ్చాక, దుఃఖతీవ్రత తగ్గాక, కన్నీళ్ళు వొత్తుకుంటూ "ఈవిడ యిలా అంటుందేమిటా? అనుకుంటున్నారు కదూ? మీరంతా 'వరం' అనుకునేదే నాపాలిట 'శాపం' అయింది. ముప్ఫైసంవత్సరాలపాటు ఆయనే నేనుగా, నేనే ఆయనగా కలిసి బ్రతికాం. వారి హఠాన్మరణంవల్ల నా గుండెకయిన లోతు గాయం వారి కంఠస్వరం విన్నప్పుడల్లా సెలవేసి బాధిస్తూ వుంటుంది. వారితో గడపిన మధురక్షణాలను గుర్తుకుతెచ్చి, 'ఆయనింక లేరు, నేనింక యేకాకిని', అన్న కటిక నిజాన్ని నాకు మళ్ళీ మళ్ళీ గుర్తుచేస్తూ వుంటుంది. ఆయన జ్ఞాపకాలనుండి తప్పుకోవడానికే మద్రాసునుంచి మకాం మార్చి యిక్కడ అజ్ఞాతంగా బ్రతుకుతున్నాను! అయినా మీలాంటి, వారి అభిమానులు, ఎలాగో తెలుసుకుని యిక్కడకు వస్తూనే వున్నారు. వారిని నిరాశపరచడంయిష్టంలేక వారిపాటల్ని వినిపిస్తూ వుంటాను. ఆ పాటలు విన్నప్పుడల్లా నా గుండె గాయంనుండి రక్తం మళ్ళీ స్రవిస్తుంది! మనిషి బాధలకు మందైన మరుపన్నదే నాకు కరువయింది బాబూ! వారి అమర గానం నన్ను నిత్యం యేదో ఒక మూలనుంచి అలుముకుని నా గుండెల్ని పిండి నన్ను చిత్రవధ చేస్తోంది! వారు అమరులే కాని నేను శాపగ్రస్తను బాబూ! శాపగ్రస్తను!"

ఆవేశంతో అనేసి ఆవిడ లోపలికి వెళ్ళిపోయింది!

మిత్రులిద్దరూ మెల్లిగా బయటకు నడిచారు!

# గ్రీష్మోద్ధతి

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

## ఉత్సాహము

నవవధూ అలాట భాగనైగనిగ్యకుంకుమ
చ్ఛవుల మెఱపి విమల రక్తచందన ప్రభాసము
ద్భవ కషాయ కాంతిజిమ్మి – తరణి – యుభయ సంధ్యలన్
సువిహితా తపముల నొప్పఁజూపె నాత్మతేజముల్ !!

గ్రీష్మతప్తమైన యెన్ని గిరులదరుల నొఱసెనో ?
యూష్మతాగుణ ప్రధానమొందినట్టిగాడ్పు, త
గ్రీష్మ విభుని యానతిం ధరించి జీవలోకమున్
భీష్మ విషమ గతులఁబఱువు పెట్టికొట్టె నిర్దయన్ !!

త్రిపుర హరల వాటికాక్షి తీవ్రమై – భయమ్మునై –
కుపిత పరశురామమూర్తి కోపమై – విపాకమై –
విపుల గాధిసూను రోషవీధియై – ప్రమాదియై –
ఎపుడు వచ్చెనో ? నిదాఘమిటులఁజూపె క్రౌర్యమున్ !!

భూమి కాగి కాగి సెగలు పొగలు వెలువరించెనో
యేమొ ? యన దిగంతములన హీనమై మరీచికా
స్తోమముల్ సెలంగె – కనులఁజూడరా నసహ్యమై
భీమమయ్యె గ్రీష్మపథము భీషణాతపమ్ములన్ !!

విధృత సకల సౌఖ్యరాశి – విస్తృత ప్రతాప సూ
ర్య ధృత కఠిన శౌర్యరేఖ – నైక బాధ్యమానసం
మధిత పక్షిలోక – మతి విమర్దనాతప ప్రభా
వధి – విధూత పాంథసౌఖ్య పదము – గ్రీష్మమెన్నగన్ !!